క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

పెదగంట్యాడ: టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ హైదారాబాద్ కంపెనీలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ హైదారాబాద్ కంపెనీలో 170 ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. ఫిట్టర్, పెయింటర్, మెషినిస్ట్ ట్రేడులలో 18 ఏళ్లు నిండి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు అప్రెంటిస్ చేస్తున్న సమయంలో రూ.11 వేలు స్టైఫండ్, మధ్యాహ్నం భోజనం, రవాణ ఖర్చులు అందజేస్తారని, అప్రెంటిషిప్ పూర్తి చేసిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించి రూ. 17వేలు వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు అన్ని ధ్రువపత్రాలు, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 28న శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ గాజువాక కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

తీశారు.. వదిలేశారు...



కాలువలో నుంచి తీసి రోడ్డుపై వేసిన మురుగుతో అవస్థలు పడుతున్న స్థానికులు

పెదగంట్యాడ : అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది ఈ చిత్రం. ఈ ఫొటోలో కనిపిస్తున్న మురుగు జీవీఎంసీ 76వ వార్డు పరిధి బాలచెరువు వంతెన వద్ద కాలువలోంచి తీసింది. దానిని వెంటనే తరలించకుండా నాలుగురోజులు గడుస్తున్న రోడ్డుపైనే వదిలేయడంతో.. ఆ మురుగు కొంతమేర మళ్లీ కాలువలోకి చేరింది.. దీని వలన సమస్య మళ్లీ మొదటికే వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పూడిక తీసి వెంటనే తరలించకుండా ఇలా వదిలేయడంతో పందులు చేరి చిందర వందర చేస్తున్నాయని. దుర్వాసన భరించలేనంతగా వస్తోందని, రాత్రి వేళలో అది కనిపించకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద కూడా ఎక్కువైందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దానిని తొలగించాలని కోరుతున్నారు.

గాజువాక న్యాయవాదుల సంఘం ఎన్నికలు నేడు

గాజువాక : గాజువాక న్యాయవాదుల సంఘం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2025–26 సంవత్సరానికి గాను అధ్యక్ష కార్యదర్శులు, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. దీని కోసం రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదేరోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మరిడిమాంబ అమ్మవారి మారువారం పండగ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామ ఇలవేల్పు మరిడిమాంబ అమ్మవారి జాతరలో భాగంగా మారువారం ఘనంగా నిర్వహించారు. గత వారం వివిధ కారణాలతో పండగ చేయనివారు, అమ్మవారికి మొక్కులు చెల్లించుకోని భక్తులు గురువారం ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసింది.

దెబ్బతిన్న వాల్వు తొలగింపు

గాజువాక : సిద్ధార్థనగర్ 12 ఎంఎల్‌డీ వాటర్ ప్రాజెక్టులోని దెబ్బతిన్న 600 ఎంఎం డయా వాల్వును నీటి సరఫరా విభాగం గురువారం తొలగించారు. దానిస్థానంలో మరో వాల్వును అమర్చారు. పాతవాల్వు దెబ్బ తిన్న కారణంగా కొద్దిరోజులనుంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. డీఈ శ్రీనివాస్, ఏఈ కేదార్‌నాథ్‌లతో కలిసి ఆయన వాల్వు మార్పు పనులను పరిశీలించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

కూర్మన్నపాలెం: వడ్లపూడి కాలనీలో పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు గురువారం అధికారులు వేశారు. అగనంపూడి పశువుల ఆస్పత్రి డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ టీకాలు 31వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టి పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ పాముల అప్పలరాజు పాల్గొన్నారు.

సదా స్మరామి..!

- మహనీయుల పేరుతో స్టీల్‌ప్లాంట్‌లో పార్కులు
- ఉక్కు పోరాటయోధుల విగ్రహాలు..

ఉక్కునగరం: భారత స్వాతంత్ర్యం కోసం అనేక మంది మహనీయులు ఎన్నో పోరాటాలు చేశారు. ఈ పోరాటాల్లో అనేక మంది తమ ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం జరిగిన ఆందోళనలో అనేక మంది మంది మృతి చెందారు. ఆ తర్వాత రాష్ట్రంలో జరిగిన 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' ఉద్యమంలో రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది అసువులు బాసారు. ఎందరో మహానుభావులు చేసిన ఆందోళనల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్ నేడు ప్రత్యక్షంగా వేలాది మందికి పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దేశం కోసం, రాష్ట్రం కోసం, విశాఖ ఉక్కు కోసం త్యాగాలు చేసి మహానుభావులను స్మరించుకునేందుకు ఉక్కునగరంలో వారి పేరిట పార్క్‌లను ఏర్పాటు చేయడంతో పాటు వారి విగ్రహాలను ఏర్పాటు చేసింది. ఏటా వారి జయంతి ఉత్సవాలను జరుపుతూ స్మరించుకునేలా చేస్తోంది.

నెహ్రూ పార్క్...



స్థానిక కేబీఆర్‌కు ఆనుకుని నెహ్రూ పార్క్‌ను ఏర్పాటు చేసి అందులో నెహ్రూ విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. 1989 నవంబర్ 14న నాటి సీఎండీ డీఆర్ ఆహుజా విగ్రహాన్ని ఆవిష్కరించారు.

తెన్నేటి పార్క్...



తెన్నేటి విశ్వనాథం

విశాఖ ఉక్కు ఆందోళనలో ముందుండి నడిపించిన నాటి పార్లమెంట్ సభ్యులు తెన్నేటి విశ్వనాథం స్మరణార్థం సెక్టర్–9లో పార్క్‌లో ఏర్పాటు చేశారు. 1992 ఆగస్టు 1న నాటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా తెన్నేటి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

హిల్‌టాప్ కూడలి సమీపంలో...



టి. అమృతరావు

స్టీల్‌ప్లాంట్ కోసం 21 రోజులు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగానికి సిద్ధపడిన ఉద్యమకారుడు టి. అమృతరావు విగ్రహాన్ని 2008 ఏప్రిల్ 27న నాటి సీఎండీ పీకే బిష్ణోయ్ ఆవిష్కరించారు.

అమర వీరుల స్థూపం...

స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణత్యాగం చేసిన 32 మంది ఉద్యమకారుల స్మృత్యర్థం హిల్‌టాప్ సమీపంలో అమర వీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు. 2008 అక్టోబర్ 14న నాటి సీఎండీ పీకే బిష్ణోయ్ ఆవిష్కరించారు.



అమరవీరులు స్థూపం

ఇందిరా గాంధీ పార్క్...



విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు మూల కారకురాలు, శంకుస్థాపన చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరిట సెక్టర్–8 కూడలి వద్ద పార్క్ ఏర్పాటు చేసి అందులో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు నిర్మించారు. 1994 నవంబర్ 19న నాటి సీఎండీ జె.మెహ్రా విగ్రహాన్ని ఆవిష్కరించారు.

మహాత్మాగాంధీ పార్క్



జాతిపిత మహాత్మాగాంధీ స్మృత్యర్థం సెక్టర్–8లో పార్క్‌లో ఏర్పాటు చేశారు. అందులో 2005 అక్టోబర్ 2న గాంధీ విగ్రహాన్ని నాటి సీఎండీ వై. శివసాగర్‌రావు ఆవిష్కరించారు.

అల్లూరి సీతారామరాజు..



దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులతో పోరాడిన అల్లూరి సీతారామరాజు కాంస్యం విగ్రహాన్ని ఉక్కు స్టేడియం కూడలి వద్ద ఏర్పాటు చేశారు. 2006 డిసెంబర్ 9న సీతారామరాజు విగ్రహాన్ని నాటి సీఎండీ వై. శివసాగర్‌రావు ఆవిష్కరించారు.

జగ్జీవన్ రామ్ పార్క్...



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ స్మరణార్థం సెక్టర్–5లో పార్క్ ఏర్పాటు చేశారు. అందులో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని 2008 ఏప్రిల్ 5 నాటి పర్సనల్ డైరెక్టర్ అయ్యప్పనాయుడు ఆవిష్కరించారు.

అంబేడ్కర్ పార్క్...



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ స్మరణార్థం సెక్టర్–లో అంబేడ్కర్ పేరిట పార్క్ ఏర్పాటు చేసి అందులో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1991 అక్టోబర్ 14న నాటి సీఎండీ పీకే రత్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

కణితి జంక్షన్ వద్ద..



తెలుగు తల్లి విగ్రహం

కేబీఆర్ సమీప కణితి కూడలి వద్ద సం. 2006 నవంబర్ 26న తెలుగు తల్లి విగ్రహాన్ని నాటి సీఎండీ వై. శివసాగర్‌రావు ఆవిష్కరించారు.

పొట్టి శ్రీరాములు



ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని మెయిన్ గేటు సమీప హిల్‌టాప్ కూడలి వద్ద ఏర్పాటు చేశారు. 2007 ఫిబ్రవరి 20న పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నాటి కేంద్ర మంత్రి టి. సుబ్బరామిరెడ్డి ఆవిష్కరించారు.

బుక్ డిపోనకు చేరిన పాఠ్య పుస్తకాలు



బుక్ డిపోనకు చేరిన పాఠ్యపుస్తకాలు

గాజువాక : ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు స్థానిక బుక్ డిపోనకు గురువారం చేరాయి. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గాను గాజువాక ఆటోనగర్‌లోగల ప్రభుత్వ బుక్ డిపోకు 3,99,153 పాఠ్యపుస్తకాలు చేరాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో గల 46 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 38 లక్షలకు పైగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3.99 లక్షల పుస్తకాలు ముద్రణా కేంద్రం నుంచి వచ్చినట్టు బుక్ డిపో అధికారులు తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా దశలవారీగా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



శిక్షణానంతరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రాజెక్టు డైరెక్టర్

కూర్మన్నపాలెం: చిన్నారులకు తగిన పోషకాహారం, నాణ్యమైన విద్య అందించడం అంగన్‌వాడీ కేంద్రాల ధ్యేయమని స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి. జయదేవ్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జయదేవ్, సీడీపీవో నీలవేణి, సూపర్‌వైజర్ స్రవంతి మానస తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో డ్రైనేజీ ఫీడర్ చానళ్ల మూత

అక్కిరెడ్డిపాలెం: పోర్టు రహదారి ఆరు లైన్ల విస్తరణతో డ్రైనేజీ ఫీడర్ చానళ్లు మూత పడుతున్నాయని, వెంటనే డ్రైనేజీ మూత పడకుండా చర్యలు తీసుకోవాలని పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం వారు ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణ పనులు వల్ల ఏడు డ్రైనేజీ ఫీడర్ చానళ్లు మూత పడతాయన్నారు. తద్వారా ఏ చిన్నపాటి వర్షాలు పడినా పంచవటి టౌన్‌షిప్‌లో నీళ్లు నిలిచి పోతాయన్నారు. రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నందున సత్వర చర్యలు తీసుకోకపోతే ఆ తర్వాత డ్రైనేజీలను గుర్తు పట్టడం కష్టంగా ఉంటుందన్నారు. వెంటనే డ్రైనేజీలు మూత పడకుండా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షులు పి. చిన్నారావు లేఖలో కోరారు.

ఉక్కు పోరాటం ఉధృతం

- ఏప్రిల్ 1న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా



దీక్షాశిబిరంలో పాల్గొన్న రోలింగ్ విభాగం కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరుశాతం అమ్మాలని కేంద్రం ప్రభుత్వం ముందుకు వెళుతోందని పరిరక్షణపోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ఆవేదన వ్యక్త చేశారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరుగుతున్న దీక్షలో గురువారం రోలింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి సాధించడానికి కార్మికులు ఒకవైపు కేంద్రం కుయుక్తులతో రకరకాల ఎత్తుగడలు వేస్తుందన్నారు. ప్రధాన మంత్రి కర్మాగారాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే పనిలో ఉన్నారన్నారు. అందువల్లే పోరాటం ఉధృతం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన విశాఖ నగరంలో జీవీయంసీ ఎదురుగా గల గాంధీ బొమ్మ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ధర్నాను జయప్రదం చేయ్యలని ఆయన కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజబాబు, దేముడు, ఆనంద్ రాంబాబు అమ్మెరు, డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో లింగేశ్వరరావుకు పతకాలు



మిక్స్‌డ్ డబుల్స్‌లో సుజాన్నేతో బంగారు పతకం గెలుపొందిన లింగేశ్వరరావు

ఉక్కునగరం: జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బీవీఎస్‌కే లింగేశ్వరరావు రెండు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో గోవా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ – సన్‌రైజ్ 47వ ఇండియన్ మాస్టర్స్ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 23 వరకు ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలకు చెందిన 2500 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. లింగేశ్వరరావు మిక్స్‌డ్ డబుల్స్ 55+ కేటగిరీలో సుజాన్నేతో పాల్గొని బంగారు పతకం గెలుపొందారు. అదే విధంగా 55+ మిక్స్‌డ్ మెన్ కేటగిరీలో ఏవీ రాజుతో పాల్గొని మరో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. దీంతో లింగేశ్వరరావు వరుసగా తొమ్మిదోసారి వరల్డ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయనను ఉక్కు అధికారులు, పలువురు క్రీడాకారులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



ధర్నాలో ప్రసంగిస్తున్న స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలపై గురువారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఏడు నెలలుగా స్టీల్ ప్లాంట్ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలపై యాజమాన్యం ప్రతిష్టంభన సృష్టిస్తుందన్నారు. ఇదే సమయంలో గడిచిన నాలుగు నెలలుగా రూ.10,200 కోట్లు విలువైన ఉత్పత్తులు అమ్మకాలు చేశారన్నారు. అర్ధాకలితో కార్మికులు కష్టించి పని చేస్తుంటే వారి కష్టాన్ని దోచుకునే పనిలో ప్రభుత్వం, యాజమాన్యాలు ఉన్నాయన్నారు. హెచ్ఆర్ఏ పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకునే చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 16 రెట్లు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం రద్దు చేయాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ వల్ల అటు ఉద్యోగులకు, ఇటు రా మెటీరియల్స్‌కు పనికి రాకుండా ఉందన్నారు. కార్యక్రమంలో వై.టి. దాస్, పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, టి.వి.కె. రాజు, కె. గంగాధర్, నీలకంఠం పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ పేర్కొన్నారు. ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7981022453 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు



నూకాంబిక అమ్మవారు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామంలో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి ఉత్సవాలను శనివారం నుంచి నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డు కృష్ణారావు, బెల్లాల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కొత్త అమావాస్యను పురస్కరించుకొన్ని అమ్మవారికి విశేష పూజలు చేయనున్నామని తెలిపారు. వేకువజాము 4 గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. అమ్మవారి పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కోలాటాలు, మ్యూజిక్ షో, ఆర్కెస్ట్రా, జబర్దస్ సత్తిపండు బృందంతో హాస్యవల్లరి కార్యక్రమం ఉంటుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



లబ్ధిదారులకు కుట్టుమిషన్లను అందజేస్తున్న బిషప్ మహంతి

గాజువాక : స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను గురువారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందని, అందులో భాగంగా కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి బోర్లను ఏర్పాటు చేస్తున్నామని, మెడికల్ శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందజేస్తున్నామని, ప్రతిరోజు అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు విజయ్‌కుమార్, మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ నిరసన



సెల్‌టవర్ కోసం తవ్విన గోతులు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

అగనంపూడి: సెల్ టవర్ సిగ్నల్ రేడియేషన్ వల్ల ప్రాణకోటికి హానికరం ఉందని, సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని 79వ వార్డు శాంతినగర్‌కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. శాంతినగర్ కాలనీలోని ఖాళీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి గతంలో ప్రైవేటు సెల్ కంపెనీ టవర్ ఏర్పాటునకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పట్లో స్థానికులు వ్యతిరేకించడం, అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో గాజువాక తహసీల్దార్ స్థల పరిశీలన చేసి సెల్ టవర్ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అయితే మళ్లీ అదే స్థలంలో మరో కంపెనీకి స్థల యజమాని లీజుకివ్వడంతో సెల్ టవర్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. గోతులు తవ్వడంతో స్థానికులు అక్కడికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. సెల్ కంపెనీ యాజమాన్యం టవర్ ఏర్పాటు పనులు నిలపివేయాలని, లేనిపక్షంలో గ్రామస్తులంతా ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, గళ్ల రాజు, నాగప్రసాద్, ఎం.గోవిందరావు, టి.శ్రీనివాసరావు, నాగమణి, ఇందల వరలహాలమ్మ, సూర్యకుమారి పాల్గొన్నారు.

ఉత్కంఠగా ప్లాంట్ లెవల్ మాక్ డ్రిల్



స్టీల్‌ప్లాంట్ మాక్ డ్రిల్‌లో ప్రసంగిస్తున్న డీసీఎఫ్ఐ సురేష్



రెస్క్యూ ఆపరేషన్‌లో సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ తార్ డిస్టిల్లేషన్ ప్లాంట్ (టీడీపీ)లో గురువారం నిర్వహించిన ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ ఉత్కంఠగా జరిగింది. ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రిపరేషన్‌ను నిర్ధారించడంలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఎఫ్ఐ) వి. సురేష్ సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉదయం టీడీపీ విభాగంలో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫిక్స్‌డ్, మొబైల్ ఫైర్ ఫైటింగ్ ఇనస్టాల్లేషన్లు, వాటర్ కర్టెన్ సిస్టంలు, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ పరికరాలతో సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ప్రమాదంలోని బాధిత వ్యక్తులను సంఘటనా స్థలం నుంచి రక్షించారు. ఆద్యాంతం మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (సర్వీసెస్) ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.